జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..
బుధవారం
08-04-2026

జిల్లా వార్తలు

WWW.DASHANEWS.COM

# అభివృద్ధిని ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతల అసత్య ప్రచారాలు

❖ గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి.



**దశ, రంగారెడ్డి ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి.. రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తుంటే బీఆర్ఎస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేక కోహెడలోని పండ్ల మార్కెట్ స్థల విషయంలో అసత్య ప్రచారం చేస్తూ.. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరులోని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. కొత్తపేటలో ఉన్న గడ్డి అన్నారం ఫ్రోర్ట్ మార్కెట్ ను ట్రాఫిక్, భవిష్యత్ ప్రణాళికను దృష్టిలో పెట్టుకొని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైయస్సార్ ప్రభుత్వ హయాంలో 2012లో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ పేరు మీద 180 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ మంత్రి హరీష్ రావుకు మతిమరుపు ఎక్కువై... ఇష్టానుసారంగా ప్రభుత్వం పై నిందలు చేస్తున్నారని అన్నారు.

ఏ ఒక్క రైతు వ్యాపారి లేకుండా కోహెడ పండ్ల మార్కెట్ స్థలంలో మంత్రి హరీష్‌రావు సమావేశాలు నిర్వహించడం సిగ్గుచేటు అన్నారు. కరోనా సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అప్పట్లో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అకారణంగా మార్కెట్ ను కోహెడకు తరలిస్తూ రైతులను, వ్యాపారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని గుర్తు చేశారు. మాజీ మంత్రులు హరీష్ రావు, సబిత ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిలు రాత్రికి రాత్రే చిన్నాచితక వ్యాపారులను, రైతులను ఏ జీవో ప్రకారం తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు.

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే, తమ నాయకుడు మల్ రెడ్డి రంగారెడ్డి పై అవాకులు చవాకులు మాట్లాడితే సహించే ప్రసక్తే లేదన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అభివృద్ధి, ప్రాజెక్టుల పేరుతో తెలంగాణ ప్రజలను బీఆర్ఎస్ పార్టీ నిలువునా దోచుకుందన్నారు. ఫార్మాసిటీ పేరుతో రైతులను దోపిడి చేసింది బీ ఆర్ఎస్ నాయకులు కాదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీష్ రావు సమావేశాలు నిర్వహించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

కోహెడ మార్కెట్ స్థలంలో బీఆర్ఎస్ పార్టీ సుమారు 5 కోట్లతో షెడ్లను నిర్మిస్తే 80 కిలోమీటర్ల మీరా వచ్చిన గాలివానకు షెడ్లు మొత్తం చిందరవందరగా పడి రైతులు, వ్యాపారులు వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. షెడ్ల నిర్మాణం పేరుతో స్థానిక ఎమ్మెల్యే, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ దోచుకు తిన్నారన్నారు. టిఆర్ఎస్ నాయకుల అబద్ధపు, అసత్య ప్రచారాలను ప్రజల నమ్మవద్దని తెలిపారు. కోహెడ లోని ఆ రెండు స్థలాలు మార్కెట్ కు సంబంధించినవేనని స్పష్టం చేశారు. అలాగే 178 ఎకరాల భూమిని టీజీఐఐసీకి ఇచ్చిన మాట వాస్తవమేనని తెలిపారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్ మార్కెట్ ను నిర్మించేందుకు సీఎం రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని, త్వరలో సీఎం చేతుల మీదుగా ఫ్రూట్ మార్కెట్ పనులను శ్రీకారం చుడుతామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరచారి, డైరెక్టర్లు మధుసూదన్ రావు, పన్యాల జైపాల్ రెడ్డి, మేకం లక్ష్మి, గణేష్ నాయక్, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నవరాజ్, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

## ఖాకీ దుస్తుల్లో కదిలే దైవాలు..

❖ ప్రమాద బాధితురాలిని ఆదుకున్న యాదగిరిగుట్ట టీజీ ఎస్పీఎఫ్ సిబ్బంది



**దశ, యాదగిరిగుట్ట:** లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం వద్ద విధుల్లో ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) సిబ్బంది తమ ఉదారతను చాటుకుని మానవత్వాన్ని నిలబెట్టారు. బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక మహిళ దీనస్థితిని చూసి చలించిన సిబ్బంది, కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుండా సాటి మనిషిని ఆదుకోవడం బాధ్యతగా భావించారు. ఇన్‌స్పెక్టర్ కె. శేషగిరిరావు సూచనల మేరకు, బాధితురాలి తక్షణ వైద్యం, అత్యవసర ఖర్చుల నిమిత్తం ఎస్ పి ఎఫ్ సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ₹22,400 ఆర్థిక సాయాన్ని అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎస్ పి ఎఫ్ ఏ ఎస్ ఐ లు శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ ప్రభు, కనకయ్య, రామయ్య, తిరుపతి సిద్దు సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడి టీచర్లకు మొబైల్ స్మార్ట్ ఫోన్లు అందజేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**దశ, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట పట్టణంలో అంగన్వాడి టీచర్లకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందించిన మొబైల్ స్మార్ట్‌ఫోన్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, అంగన్వాడి టీచర్లు సమాజంలో చిన్నారుల అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్‌ఫోన్ల ద్వారా సేవలను మరింత సమర్థవంతంగా అందించవచ్చని,డిజిటల్ విధానాల ద్వారా పిల్లల ఆరోగ్యం,పోషణ, విద్యకు సంబంధించిన సమాచారాన్ని సులభంగా నమోదు చేసి పర్యవేక్షించవచ్చని తెలిపారు.అంగన్వాడి కేంద్రాల పనితీరును మెరుగుపరచడంలో ఈ స్మార్ట్‌ఫోన్లు ఎంతో ఉపయోగపడతాయని, ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.

## శారీరక దృఢత్వమే లక్ష్యం.. యాదగిరిగుట్టలో ఎస్పీఎఫ్ సిబ్బంది 10 కే రన్




**దశ, యాదగిరిగుట్ట:** టీజీ ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లాక్రా ఆదేశాల మేరకు యాదగిరిగుట్ట ఆలయ భద్రతా విభాగం సిబ్బందికి మంగళవారం 10 కే రన్ నిర్వహించారు. తులసి కాటేజ్ నుండి మల్లాపురం వరకు సాగిన ఈ పరుగులో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. సిబ్బందిలో శారీరక దృఢత్వాన్ని పెంపొందించడం, ఒత్తిడిని తగ్గించి భక్తులకు మెరుగైన భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని ఇన్‌స్పెక్టర్ కె. శేషగిరి రావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రవి, ఏఎస్ఐలు శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ ప్రభు, కనకయ్య, రామయ్య, తిరుపతి, సిద్దు సిబ్బంది పాల్గొన్నారు.



## నగరం అభివృద్ధి చెందాలంటే పన్నులు సకాలంలో చెల్లించాలి

❖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

**దశ, నల్గొండ :** నగరం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ నిధులతో పాటు ప్రజలు కూడా సకాలంలో కార్పొరేషన్ కు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలని, నల్లగొండ కార్పొరేషన్ పరిధిలో ఉన్న యజమానులు, ప్రజలు నల్లా, ఆస్తి పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్సులకు సంబంధించిన బిల్లులను సకాలంలో చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి పాటుపడాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పన్ను వసుళ్ల కార్యకలాపాల నిమిత్తం నగరంలోని 30వ డివిజన్‌లో వ్యాపార వసూళ్ల లైసెన్సులు 41వ డివిజన్ లో ఆస్తి పన్నుల వసూలు చేపట్టారు. అదే విధంగా చెత్త రహిత కార్పొరేషన్ కోసం కృషి చేస్తున్నందున ప్రతి ఒక్కరు తడి, చెత్త పొడి చెత్త వేరువేరుగా వాహనాలకు అందించాలని కోరారు. వీధుల వెంట ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గడ్డం శ్రీనివాస్, నంద్యాల ప్రదీప్ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**దశ, యాదగిరిగుట్ట :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బీర్ల అధికారులను ఆదేశించారు. మంగళవారం మినీ మీటింగ్ హాల్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.ఇండ్ల నిర్మాణాల ప్రగతిని విప్ బీర్ల ఐలయ్య సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటి కళ నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే స్లాబ్ లెవెల్ పూర్తి అయిన ఇండ్లకు గృహప్రవేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వంగపల్లి ప్రాంతంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు కరెంట్, రోడ్లు, మంచినీటి సౌకర్యాలు వంటి మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడా మంచినీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించి, కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇంకా పూరిగుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీరాములు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బయ్యారంలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**దశ, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బయ్యారం గ్రామంలో సీఆర్ఆర్ నిధులతో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ ఇనుగాల లింగయ్య కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఈ రోడ్డు పనులు పూర్తయ్యే సరికి గ్రామంలో రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాగిరి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిన్నాల బ్రహ్మ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జాగిరి రాజబాబు గౌడ్, వార్డు సభ్యులు సాగే మహేష్, గుంటి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అయిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీలసంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎమ్మెల్యే సామేల్ కు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం అందజేత



**దశ,తుంగతుర్తి:** తుంగతుర్తి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ను ఎమ్మార్పీఎస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు ఎస్సీల సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.e సందర్భంగా జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ... ఎస్సీల సంక్షేమ పథకాలు అమలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అభయ హస్తం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సాయం తక్షణమే అందించాలని ఎస్సీ కార్పొరేషన్ నిధులు కార్పొరేషన్ శాఖకు 15 వేల కోట్లు కేటాయించి సబ్సిడీ రుణాలు కూడా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాలు సాగు భూమిని కేటాయించాలనీ, జీవో నెంబర్ 58, 59 ప్రకారం పట్టాలు ఇచ్చి అమ్ముకునే హక్కు కల్పించాలని పేర్కొన్నారు. కార్మికులు గుర్తింపు పారిశుద్ధ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి 20000 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కనుకు జానయ్య మాదిగ ,జిల్లా నాయకులు ఆకారపు వెంకన్న ,కొమ్ము సోమన్న, పానుగంటి నగేష్, ఆకారపు రాములు, కొమ్ము అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మధ్యవర్తులను నమ్మి మోసపోవొద్దు

❖ రైతులకు ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి సూచన

❖ జీళ్ళ చెరువులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**దశ, కూసుమంచి :** కూసుమంచి మండలం జీళ్ళ చెరువులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటలను మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులు పండించిన పంటకు సరైన ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ తెలిపారు. మధ్యవర్తుల వల్ల కలిగే నష్టాలను నివారిస్తూ, రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా ఈ కొనుగోలు కేంద్రం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా జీళ్ళచెరువు, పరిసర ప్రాంతాల రైతులకు ఎంతో మేలు కలుగుతుందని, వారి ఆర్థిక స్థితి మెరుగుపడటానికి ఇది కీలక అడుగని అన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో మెనూ తప్పనిసరి

❖ రోగులకు మెరుగైన వైద్యం అందించాలి.

❖ భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ పర్యటన



**దశ, అశ్వారావుపేట:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం అశ్వారావుపేట మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా విద్యా, వైద్య రంగాలకు సంబంధించిన పలు ప్రభుత్వ సంస్థలను తనిఖీ చేసి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మొదటగా అశ్వారావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ పాటిస్తున్నారా లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. కొన్ని చోట్ల మెనూ పాటించడం లేదని తమ దృష్టికి వచ్చిందని, అటువంటి ఘటనలు పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. వంటశాల నిర్వహణ, గ్యాస్ సరఫరా మరియు పరిశుభ్రతపై వివరాలు తెలుసుకుని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగినంత నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. అనంతరం అశ్వారావుపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్, వైద్య సేవ తీరును సమీక్షించారు. ఓపీ విభాగం, వార్డులు, రక్త పరీక్షా కేంద్రం మరియు మందుల నిల్వ గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు మరియు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, కొరత ఉంటే వెంటనే ఇండెంట్ పెట్టాలని అధికారులకు సూచించారు. ఆరోగ్యశ్రీ సేవల విభాగాన్ని కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు. చివరగా ప్రభుత్వం అశ్వారావుపేటలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. స్థలం విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, చేరువ మార్గాలు మరియు మౌలిక వసతుల లభ్యత వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ కిషోర్, ఎంపీడీఓ అప్పారావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూల్స్‌లో విద్య

❖ నెమలిపూరి తండా పాఠశాల

❖ ప్రధానోపాధ్యాయులు గుడిపూడి శ్రీనివాసరావు

**దశ, కామేపల్లి :** ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు కామేపల్లి మండలం,నెమలిపూరి తండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుడిపూడి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం "ప్రజాపాలన ప్రగతిప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందజేయబడతాయని, అందువలన బడి వయసు గల పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చేరాలని ఆయన కోరారు. రాబోయే విద్యా సంవత్సరానికి గాను బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వం మూడు జతల యూనిఫామ్స్, రెండు జతల బూట్లు, బెల్టు, టై, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, అల్పాహారం లాంటి అనేక సదుపాయాలు కల్పిస్తారని తెలిపారు. అదేవిధంగా నాణ్యమైన విద్య, ఫౌండే షనల్ లెర్నింగ్ స్టడీ వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తారని, ప్రతి నెల మూడవ శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా బలరాం నాయక్, ఏ ఏ పి సి చైర్మన్ గుగులోతు బుజ్జి, ఉపాధ్యాయులు నూనావత్ వెంకన్న, అజ్మీర రాము, అంగన్వాడీ టీచర్స్ పద్మ, కవిత, సరస్వతి, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు

❖ రామకృష్ణాపురం సర్పంచ్ అజ్మీర ద్వాలి

❖ ఉప సర్పంచ్ అజ్మీర బన్సీలాల్



**దశ, కామేపల్లి:** వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు కామేపల్లి మండలం,రామకృష్ణాపురం సర్పంచ్ అజ్మీర ధ్వాలి, ఉప సర్పంచ్ అజ్మీర బన్సీ లాల్ తెలిపారు. మంగళవారం పంచాయతీ పరిధిలోని హరిచంద్రపురం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద నూతన మంచినీటి బోరును వేపించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో గత ఆరు సంవత్సరాలుగా మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, దీంతో గిరిజనులు అనేక ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. ఈ సమస్య పరిష్కరించేందుకు మంచినీటి బోరును వేపించామని అన్నారు. దీంతో గిరిజనులకు మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని వారు అన్నారు. రామకృష్ణాపురం పంచాయతీ పరిధిలోని గ్రామాలు, అన్ని వార్డులలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వారు వెల్లడించారు. నిత్యం గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు భాగం రంగారావు,అజ్మీర చిన్న, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధికి నిధుల కేటాయింపు విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ వర్సెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్

**దశ, ఓయూ:** నాచారం డివిజన్ అభివృద్ధికి నిధుల కేటాయింపు విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ వర్సెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మధ్య మాటలు యుద్ధం కొనసాగుతూనే ఉంది. నిన్న భవాని నగర్లో నాచారం సీనియర్ నాయకులు సాయి జెన్ శేఖర్ ప్రెస్ మీట్ నిర్వహించి డివిజన్ అభివృద్ధికి నిధులను తామే తెచ్చామని చెప్పారు. నేడు రాఘవేంద్ర నగర్ లో నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారం శ్రీకాంత్ గౌడ్ విలేకరుల సమావేశం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ నిధులు ఇస్తుందని చెప్పడం స్థానికంగా చర్చనీయాశంగా మారింది. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి చొరవతో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నాచారం డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు తాము సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తే టిఆర్ఎస్ నాయకులకు కలిగే నష్టమేంటని ప్రశ్నించారు. దమ్ముంటే బీఆర్ఎస్ నాయకులు గడిచిన పదేళ్ళలో డివిజన్ ను ఏమీ అభివృద్ధి చేశారో డివిజన్ అభివృద్ధి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హెచ్ మోహన్, అశ్వద్ధామ రెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, భావన గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు



❖ సేవ కార్యక్రమాల్లో పాలు పంచుకున్న నాయకులు, కార్యకర్తలు



**దశ, ఇబ్రహీం పట్నం:** బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు జెర్కొని రాజు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. దేవేందర్ నగర్, ఇంద్రారెడ్డి నగర్ వద్ద గుడిసెలలో నివసిస్తున్న సుమారు 100 మందికి నిత్యావసర సరుకుల పంపిణి, ఇబ్రహీంపట్నం కట్టమైసమ్మ తల్లి ఆలయం వద్ద నడిగడ్డ ఈశ్వరాంజనేయ స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు వినోభానగర్ లోని మాతపితరుల సేవ సదన్ లో కేక్ కట్ చేసి, ప్రత్యేక ప్రార్ధనలు చేసి అన్నదానం ఏర్పాటు, వినోభానగర్ లోని స్ఫూర్తి జ్యోతి ఫౌండేషన్ అందుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి,అన్నదానం ఏర్పాటు చేసి, అనంతరం పండ్ల పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొంద్రు ప్రవీణ్, కొండిగారి త్రిలోక్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఏనుగు భరత్ రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి. రాజ్ కుమార్, నాయకులు నూకల అశోక్, దయా చారి, కరుణాకర్, ముత్యాల వినోద్, బొర్ర రమేష్ , కొంద్రు మహేష్, చెనమోని శివప్రసాద్ ,యాచారం సురేష్, ఉదయ్, జలేందర్ నాయక్ , ప్రభు, మంద కిరణ్, మల్లేష్, రవి, సతీష్, యుగేందర్, నాని రెడ్డి , సన్నీ, అజయ్ , మహేష్ , లడ్డూ ,సాయి తదితరులు పాల్గొన్నారు

# బాల్యవివాహాల నివారణకు కృషి చేయాలి: సీడీపీవో పారిజాత



**దశ, మునగాల:** బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీడీపీవో పారిజాత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బరకత్ గూడెం గ్రామంలో జిల్లాబాలల పరిరక్షణ విభాగం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మిషన్ వాత్సల్య పథకం బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ కార్యాలయం బరకత్ గూడెంలో బాలల రక్షణ కొరకు గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటుచేసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో పారిజాతం కోదాడ సీడీపీవో పారిజాత పాల్గొని మాట్లాడుతూ 18సంవత్సరాలలోపుఅమ్మాయిలకు, 21 సంవత్సరంలోపు అబ్బాయిలకు బాల్య వివాహం చేయడం బాల్య వివాహ నిషిద్ధ చట్టం 2006 ప్రకారం నేరం అని, పిల్లలకుచిన్నతనంలో పెళ్లి కావడం వలన పిల్లలు శారీరకంగా మానసికంగా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సివస్తుందనిఅన్నారు.అదేవిధంగాబాల్య వివాహం జరగడం వలన చదువుకు దూరమై బాలల అభివృద్ధికి ఆటంకం జరుగుతుందని తెలిపారు. బాలల పరిరక్షణ అధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకం ద్వారా అనాథ పిల్లలు వదిలివేయబడిన పిల్లలు రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లల కొరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం మహిళా శిశుసంక్షేమ శాఖ అనే కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. తల్లిదండ్రులు లేనిపిల్లలకు వదిలివేయబడిన పిల్లలకు ఈ పథకం ద్వారా నెలకు 4000 రూపాయలు,అదేవిధంగా రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో బాలల హోమ్స్ ద్వారా ఆశ్రయం కల్పిస్తుందని తెలిపారు. అదేవిధంగా ఈ పథకం ద్వారా బాల్య వివాహ నిర్మూలన బాల కార్మికుల నిర్మూలన బాలలపై వేధింపులు, ఇలా అనేకబాలల రక్షణ సంరక్షణ గురించిపనిచేస్తుందనితెలియజేశారు.

# వైద్యంలో నిర్లక్ష్యం జరిగితే ఉపేక్షించం

❖ కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**దశ, పెద్దపల్లి :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధి నిర్వాహనంలో నిర్లక్ష్యం వహించేవారిని ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష హెచ్చరించారు. ముఖ్యంగా పోస్టుమార్టం ప్రక్రియ పూర్తిగా ఉచితమని, దీనికి ఎవరైనా డబ్బులు తీసుకుంటే సహించమని అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో గోదావరిఖని జనరల్ ఆసుపత్రి పనితీరుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ, రామగుండం మేయర్ మహంకాళి స్వామి పాల్గొని ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలపై చర్చించారు. రోగులకు సమయానికి నాణ్యమైన వైద్యం అందించమని, వైద్యులు విధులకు హాజరు కావాలని, అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు వార్డుల్లో సేవలందించే వైద్యులు, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు డిమాండ్ చేయకూడదని, ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలన్నీ ఉచితంగా జరగాలని చెప్పారు.రోగుల సౌకర్యార్థం గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో పలు అభివృద్ధి పనులు చేపట్టబడ్డాయి. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, అంతర్గత సీసీ రోడ్లు, అదనపు షెడ్ల నిర్మాణం పూర్తయింది. సదరం శిబిరాన్ని ప్రత్యేక భవనానికి మార్చి, జిల్లా మెడికల్ బోర్డు తరలింపును ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఆసుపత్రి పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, సీసీ కెమెరాలతో అన్ని విభాగాలపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. రోగుల కోసం తగిన కుర్చీలు, లిఫ్ట్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలని, ఆసుపత్రికి అందించిన 20 ఏసీలు, 23 ఫ్రిజ్‌లను వినియోగకరంగా ఉపయోగించమని తెలిపారు. డయాగ్నస్టిక్ హబ్ ద్వారా పరీక్షా ఫలితాలు అందజేయడంలో పెద్దపల్లి జిల్లా అగ్రస్థానంలో నిలవడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.